ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

తేది : 29 ఏప్రిల్, 2022.

**రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు.**

**వైఫల్యానికి ప్రభుత్వానిదే బాధ్యత.**

**చట్టాలను పటిష్టంగా అమలు చేస్తేనే ప్రజలకు విశ్వాసం కలుగుతుంది.**

**గుంటూరు జిల్లాలో హత్యకు గురైన మహిళల కుటుంబాలకు పరామర్శ.**

**మృతుల కుటుంబాలకు 25 లక్షల నష్టపరిహారం, ఇల్లు ఇవ్వాలి.**

**పిల్లల చదువు, భవిష్యత్తుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకోవాలి.**

## సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్

గుంటూరు జిల్లా తుమ్మపూడి గ్రామంలో అత్యాచారం, హత్యకు గురైన లక్ష్మీతిరుపతమ్మ, చిలుమూరు లంకలో హత్య చేయబడ్డ రూపశ్రీ కుటుంబాలను ఈ రోజు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కలిసి పరామర్శించారు. రెండు ఘటనల్లోను మృతుల పిల్లలను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని, 10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా 25 లక్షల నష్టపరిహారం, స్వంత ఇల్లు, పిల్లల చదువుకు, స్థిరపడేందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో మహిళలపై ముఖ్యంగా పిల్లలు, దళిత, బలహీన వర్గాలకు చెందిన వారిపై అత్యాచారాలు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారం క్రిందట విజయవాడ, ఇప్పుడు ఈ రెండు ఘటనలు పట్టపగలు, ఊరి నడిమధ్యలో జరిగాయంటే దుండగులకు చట్టం పట్ల, వ్యవస్థ పట్ల ఏమాత్రం భయం లేకపోవడమే కారణమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా? లేదా? మనం నాగరిక సమాజంలోనే జీవిస్తున్నామా? లేదా? అనే అనుమానం కలుగుతున్నదన్నారు. దిశ, నిర్భయ చట్టాలు కోరల్లేని చట్టాలుగా మారిపోయాయన్నారు. ఎన్ని పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినా, ఎన్ని చట్టాలు రూపొందించినా వాటిని చిత్తశుద్ధితో అమలు చేయకపోతే ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. నేరస్థుల పట్ల పోలీసు, ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంటేనే ప్రజలకు విశ్వాసం కలుగుతుందని తెలియజేశారు. తిరుపతమ్మ మృతిపై జిల్లా ఎస్పీ గారు హత్యకు పాల్పడిన వారికి కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇవ్వకుండా అసలు అత్యాచారం జరగలేదని, అక్రమ సంబంధమే కారణమని ప్రకటించడం దారుణం. చనిపోయిన వారిపై నిందలు మోపడం వారి కుటుంబాన్ని, గ్రామస్థులను విచారానికి గురి చేసింది. ఎస్పీ స్థాయిలో అధికారులు కేసును నీరు గార్చడానికి అలా మాట్లాడి ఉండకూడదన్నారు. ప్రభుత్వం తమ ప్రకటనను సరిదిద్దుకొని తిరుపతమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి. దుండగులకు కఠిన శిక్ష పడేట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిలుమూరు లంక గ్రామానికి చెందిన రూపశ్రీ భర్త చనిపోవడంతో కూలి చేసుకుని పిల్లలను పోషించుకుంటున్నది. హత్య జరిగి మూడు రోజులవుతున్నా ప్రభుత్వ ప్రతినిధులుగాని, అధికారులు గాని కనీసం కన్నెత్తి చూడలేదని, విషయం బయటకు తెలిశాక చడీచప్పుడు కాకుండా ఆర్డీవో రాత్రి సమయంలో వచ్చి న్యాయం చేస్తామన్నారు. దీన్ని బట్టే ప్రభుత్వ అలసత్వం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. రూపశ్రీ కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ బాలుడి వైద్యానికి అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ మహిళల పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వమే చదివించాలని డిమాండ్ చేశారు.

ఈ దుర్ఘటనలకు ప్రభుత్వానిదే బాధ్యత అని, తన వైఫల్యాన్ని గుర్తించి మహిళల రక్షణ కోసం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన వారిలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి సభ్యులు వి.కృష్ణయ్య, కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వరరావు, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు ఈమని అప్పారావు, బి.కోటేశ్వరి, ఎం.రవి, వి.సాంబశివరావు, జెట్టి బాలరాజు తదితరులు ఉన్నారు.

= = =